నగరపాలక అంచనా బడ్జెట్ రూ.291కోట్లు

- స్థాయీ సంఘ సమావేశంలో సభ్యుల ఆమోదం
- నగర మేయర్ బీవై రామయ్య వెల్లడి


మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన నగరపాలక బడ్జెట్‌పై చర్చిస్తున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారులు

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ 2025- 2026 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌కు పాలకవర్గం ఆమోదం వ్యక్తం చేసింది. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మేయర్ బీవై రామయ్య అధ్యక్షతన బడ్జెట్‌పై ప్రత్యేక స్థాయీ సంఘ సమావేశం నిర్వహించారు. నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, స్టాండింగ్ కమిటీ సభ్యులు షేక్ యూనుసుబాషా, జుబేర్, మిద్దె చిట్టెమ్మ, క్రాంతికుమార్ పాల్గొన్నారు. బడ్జెట్‌పై జరిగిన చర్చల్లో అందరు సభ్యుల ఆమోదం మేరకు రూ.291.67 కోట్ల అంచనా బడ్జెట్‌ను అమోదించారు. మొత్తం ఆదాయం రూ.363.99 కోట్లు కాగా ఖర్చు రూ.291.22 కోట్లు, రెవెన్యూ అదాయం రూ.201.22 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్లు రూ.162.77 కోట్లు, మూలధన రాబడి రూ.138.69 కోట్లు, నికర మిగులు రూ.72.31 కోట్లుగా అంచనాలు తయారు చేశారు. ఇదే సమావేశంలో రెండు తీర్మానాలకు ఆమోదం వ్యక్తం చేశారు. అమృత్-2 పథకంలో భాగంగా 19 వ వార్డులోని టీచర్స్ కాలనీ పబ్లిక్ పార్కుల నిర్వహణ బాధ్యతలను పొదుపు సంఘాలకు కేటాయించారు. ఏడాది కాలానికి ఒక్కో పార్కుకు రూ.4.90 లక్షలు చెల్లించేందుకు ఆమోదం వ్యక్తం చేశారు. అలాగే 200 మంది తాత్కాలిక పారిశుద్ధ్య కార్మికులకు సంబంధించి గతేడాది డిసెంబర్ 17 నుంచి ఈ ఏడాది జనవరి 31వ తేదీ నాటికి వేతనాలు చెల్లించేందుకు రూ.42.93 లక్షలు కేటాయిస్తూ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, అకౌంట్స్ అధికారి చుండీ ప్రసాద్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓలు జునీద్, ఇశ్రాయేలు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మీ పాల్గొన్నారు.

నరహరి తీర్థుల ఆరాధన


నరహరి తీర్థులకు హారతులు పడుతున్న పీఠాధిపతి

మంత్రాలయం: మధ్వ మత పూర్వపు పీఠాధిపతి నరహరి తీర్థుల ఆరాధన వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం కర్ణాటక రాష్ట్రం హంపిలోని నరహరి మఠంలో శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల నేతృత్వంలో నరహరి తీర్థుల ఉత్తరారాధన చేపట్టారు. శాస్త్రోక్తంగా అర్చకుల వేద మంత్రోచ్ఛరణ మధ్య వేడుకలు వైభవంగా గావించారు. మంగళవారం ధార్వాడ హైకోర్టు ద్విసభ్య కమిటీ నరహరి తీర్థుల ఆరాధనకు శ్రీమఠానికి అనుమతులు ఇవ్వడంతో వేడుకలకు శ్రీకారం చుట్టారు. గతంలో ఉత్తరాది మఠం ఆధ్వర్యంలో ఇక్కడ వేడుకలు జరిగాయి.

క్లుప్తంగా

నేడు బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 23వ తేదీన గురువారం సాయంత్రం 5 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో 23 సంవత్సరాలోపు బాలబాలికలకు జిల్లా స్థాయి బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భానుప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28 నుంచి 31వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలని, వివరాలకు 99851 61007 సెల్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపు జాబ్‌మేళా

కర్నూలు(అగ్రికల్చర్): నైపుణ్యాభివృద్ధి, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 24న బి.క్యాంపులోని సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగ శివలీల తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఎల్అండ్‌టీ,టాటా క్యాపిటల్, కేఎల్ గ్రూపులు పాల్గొంటున్నాయని, హాజరయ్యే వారికి అక్కడే ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి.. 18 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులని పేర్కొన్నారు. జాబ్ మేళాలో ఎంపికైన వారికి రూ.14 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం ఉంటుంద ని తెలిపారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు రెండు ఫొటోలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 90595 24482, 77804 78910 నంబర్లకు పోన్ చేయవచ్చని సూచించారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు(సెంట్రల్): జాతీయ రహదారుల స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా యశోదాబాయి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈమె అనంతపురం జిల్లాలో పనిచేస్తూ ఇటీవల పదోన్నతి పొంది కర్నూలు జిల్లా జాతీయ రహదారుల ఎస్‌డీసీగా నియమితులయ్యారు. ఈ క్రమంలో బుధవారం బాధ్యతలు చేపట్టారు.

ఏపీటీఎస్ఏ క్యాలెండర్ ఆవిష్కరణ


టేబుల్ క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న జిల్లా ట్రెజరీ డీడీ రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ, అకౌంట్స్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా శాఖ టేబుల్ క్యాలెండర్‌ను జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు విడుదల చేశారు. బీ.క్యాంపులోని జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలనాటి సునీల్ మాట్లాడుతూ.. ఇటీవల జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఏర్పాటైందని ఆయన జిల్లా ట్రెజరీ అధికారికి వివరించారు. కార్యవర్గ సభ్యులను పరిచయం చేశారు. ఏటీఓ జయలక్ష్మి, ఏపీటీఎస్ఏ అధ్యక్షుడు శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విజేతకు అభినందన


బంగారు పతకం సాధించిన శ్రీనివాసులును అభినందిస్తున్న ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్

కర్నూలు (టౌన్): పారా స్పోర్ట్సు అసోసియేషన్ ఆఫ్ కర్నూలు ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించిన పోటీల్లో రాయలసీమ యూనివర్సిటీకి చెందిన బి.శ్రీనివాసులు అనే విద్యార్థి డిస్కస్‌త్రోలో బంగారు పతకం సాధించారు. అలాగే ఈనెల 30వ తేదీ జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా బుధవారం రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ తన చాంబర్‌లో పతకం సాధించిన విద్యార్థిని అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ బంగారు పతకంతో తిరిగి రావాలని ప్రోత్సహించారు. ప్రొఫెసర్ సుందరానంద్ పుచ్చ, వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు.

వేద విద్యార్థుల మృతి బాధాకరం

కర్నూలు(అర్బన్): కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంత్రాలయం వేద పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు, డ్రైవర్ మృతి చెందడం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వెంకటరామరాజు అన్నారు. హంపి క్షేత్ర పర్యటనకు వెళ్లిన వారి వాహనం సింధనూరు సమీపంలో ప్రమాదానికి గురైందని, ఈ ఘటనలో మరికొందరు గాయపడడంపై బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలని కోరారు.

ఆస్పిరేషనల్ బ్లాకు లక్ష్యాలు సాధించాలి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

కర్నూలు(సెంట్రల్): నీతి ఆయోగ్ చేపడుతున్న ఆస్పిరేషన్ బ్లాకుల్లో నిర్దేశించిన లక్ష్యాల సాధన కోసం చర్యలు తీసుకోవాలని నీతి ఆయోగ్ అడిషనల్ మిషన్ డైరెక్టర్ మహేంద్రకుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఆస్పిరేషనల్ బ్లాకులైన మద్దికెర, చిప్పగిరి, హొళగుందలో జరుగుతున్న అభివృద్ధి పనులపై కలెక్టర్లతో సమీక్షించారు. ఆయా లక్ష్యాల సాధన కోసం వారాంతపు నిర్దేశాలు చేసుకోవాలన్నారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వరలక్ష్మీ, ఇన్‌చార్జ్ సీపీఓ భారతి, ఐసీడీఎస్ పీడీ నిర్మల, డీఆర్‌డీఏ పీడీ శివలీల, డీఎంహెచ్ఓ శాంతిలత తదితరులు పాల్గొన్నారు.

‘హత్యకేసు నిందితుడు బీజేపీ జిల్లా అధ్యక్షుడా?’


మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు

కర్నూలు(సెంట్రల్): 2022 జనవరి 27వ తేదీన కొతాళం మండలం కామవరంలో దళితులపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనలో నిందితుడిగా ఉన్న రామకృష్ణను కర్నూలు జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు పేర్కొన్నారు. బుధవారం కేవీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితులపై పగ ఉన్న వ్యక్తి తప్పా బీజేపీకి మరొకరు జిల్లా అధ్యక్షుడిగా దొరకలేదా అని ప్రశ్నించారు. ఆయనకు హత్య ఘటనతోపాటు అసాంఘిక కార్యక్రమాలైన గుట్కా, మట్కాలతో కూడా సంబంధం ఉన్నట్లు ప్రజలు చర్చించుకున్నట్లు ఆరోపించారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆ పార్టీ నాయకుడు అమిత్‌షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కించపరిచేలా మాట్లాడారని, ఇప్పుడు దళితులపై పగ ఉన్న వ్యక్తికి బీజేపీ జిల్లా అధ్యక్షుడి పదవి ఇచ్చారంటే ఆ పార్టీకి వెనుకబడిన వర్గాలపై ఉన్న ప్రేమ కనబడుతోందని ఎద్దేవా చేశారు. ఇది బీజేపీ కుటిలనీతికి నిదర్శమన్నారు. వెంటనే ఆయన్ను బీజేపీ జిల్లా అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఎం.రాజశేఖర్, ఎన్‌జీ కృష్ణ పాల్గొన్నారు.

అమిత్ షా రాజీనామా చేయాలి


పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

కర్నూలు(సెంట్రల్): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీశారని, ఆయన వెంటనే మంత్రికి పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కర్నూలు జిల్లా వ్యవహారాల ఇన్‌చార్జ్ అంబటి రామకృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపూజీ, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర కర్నూలులో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి గడియారం ఆసుపత్రి మీదుగా అంబేడ్కర్ విగ్రహం వరకు నాయకులు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమిత్‌షా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల హక్కులను కాలరాయాలని చూస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలు ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ మాట్లాడుతూ.. వెంటనే అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని, అప్పటివరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకరబాబు, నియోజకవర్గాల కో-ఆర్డినేటర్లు కాశీం, లక్ష్మీనారాయణ, రమేష్‌యాదవ్, క్రాంతినాయుడు, మురళీకృష్ణంరాజు, దేవిశెట్టి ప్రకాష్ పాల్గొన్నారు.

నేడు 20 సూత్రాల ప్రోగ్రాం చైర్మన్ రాక

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా పార్టీ ముఖ్య నాయకులు, ప్రభుత్వ 20 సూత్రాల ప్రోగ్రాం చైర్మన్ లంక దినకర్ గురువారం కర్నూలుకు వస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.రామకృష్ణ తెలిపారు. స్థానిక నరసింహారెడ్డి నగర్‌లోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారని తెలిపారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, సమావేశంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు

మాజీ సైనికుడి మృతి


శంకర్ (ఫైల్)

కర్నూలు (అర్బన్): నగరంలోని వెంకటరమణ కాలనీ మమతా నగర్‌లో నివాసముంటున్న మాజీ సైనికుడు నాయక్ సి.శంకర్ (68) బుధవారం మృతిచెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నర్రా పేరయ్య తెలిపారు. ఆయన మద్రాసు రెజిమెంట్‌లో 22 సంవత్సరాలు పనిచేసి పదవీ విరమణ చేశారన్నారు. ఆయన అంత్యక్రియలు ఈనెల 23వ తేదీన నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. బాధిత కుటుంబానికి సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

ప్రజాసంఘాల నాయకుల గృహ నిర్బంధం


మహిళా ఐక్యవేదిక కార్యాలయంలో ప్రజా సంఘాల నాయకులను నిర్బంధించిన పోలీసులు

కర్నూలు: కల్లూరు మండలం నాయకల్లు గ్రామానికి చెందిన భారతి (21) అదృశ్యం కేసును ఛేదించాలని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమలరావును కలిసేందుకు ప్రయత్నించిన ప్రజాసంఘాల నాయకులను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి, ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎరుకల రాజును బుధవారం బి.క్యాంప్‌లోని మహిళా ఐక్యవేదిక కార్యాలయంలో మూడో పట్టణ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. నాయకల్లు గ్రామానికి చెందిన భారతి జనవరి 1వ తేదీన కుటుంబ కలహాల కారణంగా హంద్రీనీవా కాలువలో దూకి గల్లంతైనట్లు పోలీసులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఆమె మృతదేహం లభించలేదు. ఆమె ఆచూకీ కనుగొని కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ డీజీపీకి వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తున్నట్లు సమాచారం అందడంతో మూడో పట్టణ పోలీసులు వారిని ముందస్తుగా గృహనిర్బంధం చేశారు. డీజీపీ పర్యటన ముగించుకుని వెళ్లిపోయిన తర్వాత వారిని వదిలిపెట్టారు.

ఉద్యానవనాల నిర్వహణ మెరుగుపడాలి


నేతాజీనగర్ మున్సిపల్ పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): నగరంలో ఉద్యానవనాల నిర్వహణ మరింత మెరుగుపడాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. బుధవారం స్థానిక నేతాజీ నగర్‌లోని ఉద్యాన వనాన్ని, రాంబొట్ల దేవాలయం వద్ద ఉన్న బండు రహదారి, వీకర్ సెక్షన్ కాలనీలో నూతనంగా నిర్మించిన మురుగు కాల్వలను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆహ్లాదకరమైన వాతావరణం కోసం ఆయా కాలనీల ప్రజలు, వృద్ధులు, మహిళలు ఉద్యానవనాలకు వస్తుంటారని, అధికారులు నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. పిచ్చి మొక్కల తొలగింపు, చిన్నపాటి మరమ్మతులు, నిర్మాణాలు, పచ్చదనం పెంపునకు కృషి చేయాలన్నారు. రాజ్‌విహార్, వినాయక్ ఘాట్ ఐదు రోడ్ల కూడలిలో కమిషనర్ పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. డీఈఈలు కృష్ణలత, గిరిరాజు, ఏఈ భానుప్రతాప్ పాల్గొన్నారు.

వెంటనే పీఆర్‌సీ ప్రకటించాలి


జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు వినతిపత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

కర్నూలు (సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తక్షణమే 12వ పీఆర్‌సీ ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి కుమార్, నవీన్ పాటి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు బుధవారం ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ పి.రంజిత్ బాషాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని, ఏపీజీఎల్ఐసీ, పీఎఫ్, ఈఐఎస్‌లకు సంబంధించిన బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. 2003లో ఉద్యోగాలు పొందిన వారికి పాత పెన్షన్‌ను వర్తింపజేయాలని, కారుణ్య నియామక ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు హేమంత్ కుమార్, యెహోషువ, తిమ్మన్న, దుర్గాప్రసాద్, సుధాకర్, హనుమన్న పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి


మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు అజాద్

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి సర్కార్ విఫలమైందని పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఆజాద్ విమర్శించారు. కర్నూలులో బుధవారం జరిగిన పీడీఎస్‌యూ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు దాటినా విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం వైపుగా చర్యలు చేపట్టడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,850 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, యాజమాన్యాలు ఫీజు చెల్లించాలని విద్యార్థులపై ఒత్తిడి చేస్తుండడంతో చదువుకోలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. తాము అధికారంలోకి వస్తే తల్లికి వందనం కింద ఎంత పిల్లలు ఉంటే అంత మందికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయమంటే అదిగో..ఇదిగో అంటూ మాటలు చెబుతున్నారన్నారు. పేద విద్యార్థులకు ఉన్నత పీజీ విద్యను దూరం చేసే జీఓ 77ను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేసి మాట నిలబెట్టుకోవాలన్నారు. జీఓ నంబరు 117 ప్రకారం మూతబడిన స్కూళ్లను పునఃప్రారంభించాలన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో జీఓ నంబరు 107, 108లను రద్దు చేయాలని, ఉన్నత విద్యతో పాటు, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని, విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను చెల్లించాలన్నారు. ఆ సంఘం నాయకులు రాజేష్, టీయూసీఐ నాయకులు తిరుపాల్, రైతు కూలీ సంఘం నాయకులు అర్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ వర్సిటీ పనులను పూర్తి చేయాలి


అంసంపూర్తిగా ఉన్న భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు సమీపంలోని జగన్నాథగట్టుపై నిలిచిపోయిన క్లస్టర్ యూనివర్సిటీ పనులను పూర్తి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా డిమాండ్ చేశారు. బుధవారం ఎస్ఎఫ్ఐ బృందం నిలిచిపోయిన క్లస్టర్ యూనివర్సిటీ పనులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. న్యాక్ ఏ గ్రేడు ఉన్న యూనివర్సిటీకి సరైన భవన సముదాయం లేకపోవడంతో సిల్వర్‌జూబ్లీ, కేవీఆర్, ఫర్‌మెన్ కళాశాలలో తాత్కాలికంగా నడిచేలా ఏర్పాట్లు చేశారన్నారు. దీంతో ఆయా కళాశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులుపడుతున్న నేపథ్యంలో వెంటనే పనులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు అమర్, మల్లేష్, మనోహర్, శంకర్, చింటూ, తరుణ్ పాల్గొన్నారు.

సర్వీసు ప్రొవైడర్లకు ఉపాధి అవకాశాలు


దరఖాస్తులను స్వీకరిస్తున్న సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్ రెడ్డి

కర్నూలు (టౌన్): సర్వీసు ప్రొవైడర్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సిటీ మిషన్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం స్థానిక చిల్డ్రన్స్ పార్కు వద్ద ఉన్న బాలభవన్‌లోని మెప్మా కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ పరిధిలో నివశిస్తున్న ప్లంబింగ్, కార్పెంటరీ, ఎలక్ట్రికల్ వర్క్స్, ఏసీ మెకానిక్స్, రిఫ్రిజిరేటర్ రిపేరు, వాటర్ ప్యూరిఫయర్ సర్వీస్, గీజర్ రిపేర్, వాషింగ్ మిషన్ సర్వీస్, టీవీ రిపేరు తదితర వృత్తి కోర్సుల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్ అందించడమే గాకుండా వారికి జీవనోపాధి కల్పిస్తున్నట్లు చెప్పారు. పురుషులు, స్త్రీలు ఈ అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. టీఎంసీ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రజకులకు పోస్టులు కల్పించాలి


ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు వినతి పత్రం అందిస్తున్న రజక సంఘాల నేతలు

కర్నూలు(అర్బన్): ప్రభుత్వ కార్యాలయాలు, హాస్పిటల్లు, పోలీస్ శాఖ, ఏపీపీటీడీ, ఏపీపీటీడీ ఆర్టీసీలో దుస్తులు శుభ్రం చేసే టెండర్స్, దోబీ పోస్టులను రజక సొసైటీలకు అప్పగించాలని ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 27 అమలు అయ్యేలా చర్యలు చేపట్టాలని రజక సంఘాల నేతలు కోరారు. బుధవారం కర్నూలుకు వచ్చిన రాష్ట్ర డీజీపీ, ఏపీఎస్ఆర్‌టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును రజక సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాడాల నాగరాజు, నాయకులు కేతూరు మధు, గోల్డ్‌మెన్ శ్రీనివాసులు కలిసి వినతి పత్రం అందించారు. ముఖ్యంగా ఏపీపీటీడీ ఆర్టీసీలో గుర్తింపు పొందిన రజక సొసైటీలకు ఈ జీఓను అమలు చేసే విధంగా డీపీటీఓకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఆయా ప్రభుత్వ శాఖల్లో ఈ జీఓను అమలు చేస్తే అనేక రజక కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందన్నారు. కుల వృత్తులను నమ్మకొని జీవనం గడుపుతున్న రజకులకు న్యాయం చేయాలని కోరారు.

కార్మికుల కృషితోనే ఆర్టీసీకి మనుగడ

కర్నూలు(సెంట్రల్): కార్మికులు కష్టపడి పనిచేస్తేనే ఆర్టీసీ మనుగడ సాధ్యమని ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ, డీజీజీ ద్వారక తిరుమలరావు పేర్కొన్నారు. ఆయన బుధవారం కర్నూలు - 1 డిపోను సందర్శించా రు. అక్కడి కార్మికులతో మాట్లాడారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైనా అప్పులు సంస్థనే తీర్చాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో కార్మికులు కష్టపడి పనిచేయకపోతే ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. మరోవైపు కార్మికులకు రావాల్సిన బకాయిలను నెలఖారులోపు సీఎం చంద్రబాబునాయుడుతో మాట్లాడి ఇప్పిస్తానని, ఇతర సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ఆర్ఎం శ్రీనివాసులు, డిపో మేనేజర్ సుధారాణి పాల్గొన్నారు.

రామాయణంపై పరీక్ష


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి

కర్నూలు కల్చరల్: అయోధ్యలో బాలరాముడి విగ్ర హ ప్రతిష్ఠ వార్షికోత్సవం సందర్భంగా వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నగరంలోని పలు పాఠశాలల్లో రామా యణంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఏక్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో నిర్వహించిన పరీక్షలను వీహెచ్‌పీ దక్షిణాంధ్ర రాష్ట్ర అధ్య క్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నగరంలోని 15 పాఠశాలల్లో 1500 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ పరీక్షల వల్ల రామాయణంలోని విషయాలు విద్యార్థులకు తెలుస్తాయన్నారు. వీహెచ్‌పీ రాష్ట్ర కోశాధికారి సండడి మహేశ్వర్, సహ కోశాధికారి సుబ్రహ్మణ్యం, సేవా కన్వీనర్ గురుమూర్తి, కార్యదర్శి భాను ప్రకాష్ పాల్గొన్నారు.

హాస్టళ్ల మరమ్మతులకు నిధుల మంజూరు

కృష్ణగిరి: ఎస్సీ హాస్టళ్ల భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు కావడంతోపాటు టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందని, తర్వలో పనులు ప్రారంభిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని కంబాలపాడు, ఎరుకలచెర్వు గ్రామాల్లోని ఎస్సీ హాస్టళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల మరమ్మతులకు నిధులు మంజూరు కాగా ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ కింద ఆరు హాస్టళ్లకు దాదాపుగా రూ.2 కోట్లు మంజూరయ్యాయన్నారు. మండలంలోని కంబాలపాడు హాస్టల్‌కు రూ.92.33 లక్షలు, ఎరుకలచెర్వు హాస్టల్‌కు రూ.37.60 లక్షలతో పనులు చేపడతామని చెప్పారు. పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయిందని త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. డీఈ మహబూబ్‌ఖాన్, ఏఈ హరినాథ్, వార్డెన్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

తెలుగు కీర్తి ప్రతిభా పురస్కారం ప్రదానం

గోనెగండ్ల: మండల పరిధిలోని పెద్దమరివీడు జెడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆరెకటికె నాగేశ్వరరావుకు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ఈయన రెండు వేలకు పైగా వచన కవితలు రాశారు. అలాగే నాలుగు పుస్తకాలు రచించారు. ఈయన తెలుగు భాషకు చేస్తున్న సేవలకు గాను పురస్కారం వరించింది. ఈనెల 21వ తేదీ శ్రీ కొత పూర్ణానంద్ విలాస్ కళావేదిక విజయవాడలో శ్రీ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేదికలో కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీభూషణ, ప్రధాన కార్యదర్శి పార్థసారధి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను బుధవారం స్థానిక ఉపాధ్యాయులు అభినందించారు.

లంబాడీలకు వైన్‌షాపులు కేటాయించాలి


మాట్లాడుతున్న సంఘం నాయకులు

కర్నూలు(రూరల్): గిరిజన లంబాడీలకు మద్యం దుకాణాలను కేటాయించాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కైలాస్ నాయక్ డిమాండ్ చేశారు. నందనపల్లె సుగాలి తండాలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో గిరిజన లంబాడీలకు సరైన గుర్తింపు లభించలేదని తెలిపారు. సంక్షేమ పథకాలు, కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 40 నియోజకవర్గాల్లో లంబాడీలు 12 లక్షల జనాభా ఉన్నారన్నారు. సామాజికవర్గానికి మద్యం దుకాణాలను కేటాయించాలని కోరారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రంగనాయక్ పాల్గొన్నారు.